క్లుప్తంగా

'ఆడుదాం ఆంధ్రా'తో యువతకు ఉజ్వల భవిత



గుంటూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్ని ప్రోత్సహించి వారికి ఉజ్వల భవిష్యత్తును కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టారని రూరల్ ఎంపీడీవో ఆదినారాయణ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయాల పరిధిలో శనివారం ఆడుదాం ఆంధ్రా ర్యాలీని నిర్వహించారు. లాలుపురంలో ర్యాలీని ఎంపీడీవో జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె. శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్ల పంపిణీ

పెదకాకాని: మండలంలోని వెనిగండ్లకు చెందిన మున్నంగి వెంకటరెడ్డి, నరుకుళ్లపాటి అంకమ్మరావు, ఆదిత్య ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో శనివారం వెనిగండ్ల, నంబూరు జెడ్పీ హైస్కూళ్లలో టెన్త్ విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన టెస్ట్ పేపర్ల పంపిణీ చేశారు. టెస్ట్ పేపర్లను సద్వినియోగం చేసుకుని విద్యార్థులంతా మంచి మార్కులు సాధించాలని దాతలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కానుగంటి రంగారావు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ



గుంటూరు మెడికల్: హెచ్ఐవీ బాధితులు క్రమం తప్పకుండా ఏఆర్టీ మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా జీవిత కాలాన్ని పొడిగించుకోవడంతో పాటు, ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లంకపల్లి మధుసూదనరావు సూచించారు. స్థానిక మంగళదాస్‌నగర్‌లోని హ్యాపెన్ కార్యాలయంలో హెచ్ఐవీ బాధితుల మధ్య జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. హ్యాపెన్ ప్రాజెక్టు డైరెక్టర్ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ హెచ్ఐవీ చిన్నారులకు ప్రభుత్వ సహాయంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో కె.రవికుమార్, దుర్గ, జయరాజు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

నెహ్రూనగర్: విశ్వ బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని గుంటూరు పట్టణ సంఘ అధ్యక్షుడు కడియాల సుబ్బారావు కోరారు. అరండల్‌పేటలోని విశ్వ బ్రాహ్మణ కల్యాణ మండలంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విశ్వ బ్రాహ్మణులు 20లక్షల పైగా ఉన్నప్పటికీ, చట్ట సభల్లో ఎటువంటి ప్రాధాన్యత కల్పించలేదని తెలిపారు. ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పిం లని విజ్ఞప్తి చేశారు. సంఘ నాయకులు మేడిపి వెంకటప్రసాద్, చిరంజీవాచారి, చిలకపాటి బ్రహ్మయ్య, శివరామకృష్ణ, గురవాచారి పాల్గొన్నారు.

క్రీస్తు జన్మదినం ప్రపంచానికి పండగ రోజు

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్
- నల్లపాడు కాలేజీ సెంటర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు



ప్రార్థనలో పాల్గొన్న కిరణ్‌కుమార్ తదితరులు

గుంటూరు రూరల్: క్రీస్తు జన్మదినం ప్రపంచానికి పండగ దినమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. నల్లపాడు ఎంబీటీఎస్ కళాశాల సెంటర్‌లో శనివారం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు తోడుంటే విజయాలు వెన్నంటే ఉంటాయని, ఆయన సన్నిధిలో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఏసు క్రీస్తు నామాన్ని ఘనపరిచన వారు అన్ని రంగాల్లో ముందుంటారని, ఆయన కృప ఎల్లపుడూ వారికి ఉంటుందని చెప్పారు. లోకంలోని ప్రజల పాపాల్ని తన రక్తంతో శుద్ధచేసి పరలోక రాజ్యాన్ని కల్పించిన క్రీస్తు మార్గం ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని సూచించారు. ఆయన శాంతి ప్రేమ మార్గంలో ప్రతి ఒక్కరూ నడిచి క్రీస్తు నామాన్ని ఘనపరచాలని తెలిపారు. కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి, చల్లావారిపాలెం సర్పంచ్ ఆరుదల సాంబశివరావు, డివిజన్ కన్వీనర్ దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, దుగ్గెంపూడి బాల అంజిరెడ్డి, ఇంటూరి అంజిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ ఆళ్ల రవిదేవరాజు, రాజారెడ్డి, మువ్వా కృష్ణ, అర్బన్ క్లస్టర్-1 కన్వీనర్ ఏటుకూరి విజయసారథి, నరేంద్రరెడ్డి, జాన్‌పాల్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెదనందిపాడులో..

యేసుక్రీస్తు ఆశీస్సులు అందరికీ ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆకాంక్షించారు. మండల పరిధిలోని వరగానిలో శనివారం రాత్రి ఆంధ్రా ఇవాంజికల్ లూథరన్ చర్చి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రిస్మస్ పర్వదినాన్ని చక్కగా జరుపుకోవాలని తెలిపారు. క్రీస్తు జననంతో లోకానికి వెలుగు వచ్చిందని, ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాలని సూచించారు. ఫాస్టర్ కొరివి కెనడి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సెమీ క్రిస్మస్ కేకును కట్ చేశారు. చిన్నారులు నృత్య ప్రదర్శనతో అలంకరించారు. కార్యక్రమంలో మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్, స్త్రీల సమాజం సభ్యులు, లూథరన్ చర్చి యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కత్రపాడులో...

కత్రపాడులో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. క్రీస్తు సందేశాన్ని ఆయన ప్రజలకు తెలియజేశారు. అనంతరం క్రిస్మస్ కేకును కట్ చేశారు. కార్యక్రమంలో కత్రపాడు, అన్నవరం ఎంపీటీసీ సభ్యులు చెల్లి లక్ష్మి, కల్లూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న కిరణ్‌కుమార్

పెదనందిపాడు: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, మిచాంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులందరినీ ఆదుకోవడానికి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహనరెడ్డి కృషి చేస్తున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. పెదనందిపాడు సచివాలయం -1 వద్ద శనివారం మధ్యాహ్నం రైతులకు 80 శాతం సబ్సిడీపై ఆయన శనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని తెలిపారు. ప్రతి రైతుకూ న్యాయం చేయడమే లక్ష్యమని చెప్పారు. అనంతరం పెదనందిపాడు మండలంలో పంటల నష్టం గురించి ఏవో సుధారాణిని అడిగి తెలుసుకున్నారు. రైతులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి పద్మారావు, ఉప సర్పంచ్ దివ్వి రాంబాబు, మండల కన్వీనర్ షేక్ ఖాశీంపీరా, వైస్ ఎంపీపీ షేక్ ఖాశీంబీ, పెదనందిపాడు, ఏబీ పాలెం సొసైటీ అధ్యక్షుడు డి. నాగేశ్వరరావు, కె.భూషయ్య, మొవ్వా శ్రీనివాసరావు, ధూళిపాళ్ల సుబ్బారావు, కారుమూరి పుష్పరాజ్, అల్లడి వెంకటేశ్వర్లు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న సుబ్బారావు, నర్సిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రాంతీయ క్రీడా పోటీల్లో హిందూ ఇంజినీరింగ్ కళాశాల డిప్లొమా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్. సుబ్బారావు తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నల్లపాడులోని ఎంబీటీఎస్, గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లలో జరిగిన క్రీడా పోటీల్లో తమ విద్యార్థులు బహుమతులు గెలుపొందినట్లు తెలిపారు. 400 మీటర్ల రిలేలో చైతన్య, సుమంత్, రాకేష్, శ్రీనివాస్ జిల్లా స్థాయిలో మొదటి స్థానం, బాలికల విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో వైష్ణవి మనోజ్ఞ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. వీరంతా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, పోటీల సమన్వయకర్త సందీప్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ క్రోసూరి రవి అభినందించారు.

ఖురాన్ కంఠస్థ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎండీ మున్ను, ఫోరం ఫర్ ఖురాన్ స్టడీస్ సభ్యులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధ్యాత్మిక విద్య చిన్నతనం నుంచే అలవర్చుకోవడం ద్వారా సమాజంలో ఉత్తములుగా రాణించవచ్చునని జైన్ హైస్కూల్ డైరెక్టర్ మొహ్మద్ మున్ను అన్నారు. సంగడిగుంటలోని జైన్ హైస్కూల్లో శనివారం యునైటెడ్ ఫోరం ఫర్ ఖురాన్ స్టడీస్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎండీ మున్ను మాట్లాడుతూ పవిత్ర ఖురాన్ గ్రంథంలోని అంశాలను ఆచరణలోకి తీసుకోవడం ద్వారా ఇహలోక, పరలోకాల్లో సైతం విజయవంతం కావచ్చని చెప్పారు. ఆధ్యాత్మికతను ప్రతి ఒక్కరూ కలిగి ఉండడం వల్ల శాంతి సౌభ్రాతృత్వం దయ, కరుణ వంటి విషయాలు చిన్నతనం అలవడతాయని తెలిపారు. యునైటెడ్ ఫోరం ఫర్ ఖురాన్ స్టడీస్ సెమీఫైనల్, ఫైనల్ పోటీల్ని సైతం నిర్వహిస్తూ సమాజంలో మంచిని పెంపొందించే విధంగా కార్యక్రమాలు రూపొందించడంపై అభినందనలు తెలిపారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు క్వార్టర్ ఫైనల్, సెమీ ఫైనల్‌తో పాటు ఫైనల్స్‌కు వెళతారని పేర్కొన్నారు. విజేతలకు ప్రముఖులతో నగదు బహుమతి అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో యునైటెడ్ ఫోరం ఫర్ ఖురాన్ స్టడీస్ జిల్లా అధ్యక్షుడు జహీర్, సభ్యులు హిదాయతుల్లా బేగ్, అలీమ్, ముస్లిం ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పిల్లల మానసిక వైద్యశాల ప్రారంభం



గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల పిల్లల్లో మానసిక సమస్యలు ప్రతి ఏడాది పెరిగిపోతున్నాయని ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ ఐ.శ్రీరమ్య తెలిపారు. స్థానిక ఓల్డ్ క్లబ్ రోడ్డులో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లలు, మహిళల మానసిక ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఆదివారం స్థానిక సాంబశివపేట 3వ లైనులో పాత్ వేస్ సైకాలజీ చికిత్సా కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మానస హాస్పిటల్ అధినేత, మానసిక వైద్య నిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఐ.వి.ఎల్.నరసింహారావు, రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ ఇవటూరి శరత్ చంద్ర మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా గుంటూరు నగరంలో మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. వృద్ధులకు ప్రతినెలా ఉచిత మానసిక వైద్య శిబిరం ఏర్పాటు చేసిన మందుల కూడా ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. పిల్లల్లో, యువతలో వస్తున్న వివిధ రకాల మానసిక రుగ్మతలు, ప్రవర్తన సమస్యల్ని ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా వాటిని కట్టడి చేయవచ్చని తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ కొసరాజు కళాధర్, డాక్టర్ మంజులూరి భువనేశ్వరి ముఖ్య అతిథులుగా పాల్గొని హాస్పిటల్‌ను ప్రారంభిస్తారని వారు తెలిపారు.

క్రీస్తు నామంతో జయం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్



వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

గుంటూరు రూరల్: క్రీస్తు నామంలో విజయం కలుగుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ తెలిపారు. మండలంలోని వెంగళాయపాలెంలో శనివారం హోలీ స్పిరిట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలతో పాటు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో నడిచి ప్రేమను, శాంతిని కలుగజేయాలని సూచించారు. ఆయన్ను నమ్మిన వారికి ఎల్లపుడూ తోడుగా ఉంటాడని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పాస్టర్స్‌కు వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో డొక్కా మాణిక్యవరప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు కలిమల పురుషోత్తం, కన్వీనర్ ఇశ్రాయేలు సత్యప్రకాష్, కొలకలూరి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్టార్టప్‌ల స్థాపన దిశగా విద్యార్థులు ఆలోచించాలి



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థి దశ నుంచే అంకుర పరిశ్రమల స్థాపన దిశగా ఆలోచనలు చేయాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో శనివారం ప్రాసెస్ ఆఫ్ ఇన్నోవేషన్ డెవలప్మెంట్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కేవలం ఉద్యోగాల కోసం కాకుండా పది మందికి ఉపాధిని కల్పించే దిశగా కృషిచేయాలని సూచించారు. మెలట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో వి.ఎస్.ఎన్. లోకేష్ మాట్లాడుతూ అంకుర పరిశ్రమల స్థాపించడంలో వివిధ దశలు, సత్ఫలితాలు సాధించడానికి అనుసరించాల్సిన పద్ధతుల్ని విద్యార్థులకు వివరించారు. దేశానికే వెన్నుముక అయిన రైతుకు అధిక దిగుబడి, లాభాల బాట కల్పించేందుకు నూతన టెక్నాలజీని ఆవిష్కరించాలని సూచించారు. మేధాశక్తిని స్వదేశానికే పరిమితం చేయాలని చెప్పారు. పేద రైతు కుటుంబంలో పుట్టిన తానూ విద్యను అభ్యసిస్తూనే ఇష్టమైన ఆక్వా రంగానికి టెక్నాలజీని జోడిస్తూ జరిపిన పరిశోధనల్లో ఉత్తమ ఫలితాలను సాధించినట్లు చెప్పారు. వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు కూడా తన ఆలోచనల్ని పంచుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి. శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.వి.పి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హృద్రోగ బాధితులకు అండగా 'బజరంగ్'



యాంజియోగ్రామ్ పరీక్షల కోసం వచ్చిన ఉప్పలపాడు గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

యాంజియోగ్రామ్ పరీక్షల కోసం ప్రత్యేక బస్సులో ఆసుపత్రికి తరలింపు

పెదకాకాని: హృద్రోగ వైద్య పరీక్షలు అవసరమైన వారికి బజరంగ్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అండగా నిలిచారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా ఈనెల 21న ఉప్పలపాడులో ఏర్పాటు చేసిన 'బజరంగ్ సంక్షేమ సంగమం' కార్యక్రమం ద్వారా 'మీ గుండె పదిలం' శిబిరంలో యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమైన 35 మందిని గుర్తించారు. వారందరినీ చికిత్స నిమిత్తం శనివారం ప్రత్యేక బస్సులో విజయవాడ మెడ్ స్టార్ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా యాంజియోగ్రామ్‌కు హాజరైన పేషెంట్లను అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్ద వయస్సులో ఉన్న వారు ఏటా క్రమం తప్పకుండా ఒకసారి గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జగనన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా 'మీ గుండె పదిలం' నినాదంతో చేపట్టిన వైద్య శిబిరాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. గుండె సమస్య ఉన్న వారు అది తీవ్రతరం కాకముందే ఈ శిబిరం ద్వారా వైద్య సహాయం పొందడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. బాధితులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తూ, వేగవంతంగా సకాలంలో వైద్య సహాయం అందేందుకు తోడ్పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని మరిన్ని గ్రామాలకు తీసుకువెళతానని ఆయన స్పష్టం చేశారు. బజరంగ్ బృందం ఉప్పలపాడు గ్రామం నుంచి ప్రత్యేక బస్సు ద్వారా పేషెంట్లను ఆసుపత్రికి చేర్చడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి వేడుకలు





చేబ్రోలు, కొత్త రెడ్డిపాలెం గ్రామాల్లో ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న స్వామి



చేబ్రోలులో ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న శ్రీ భూనీలా సమేత ఆదికేశవస్వామి

మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. చేబ్రోలులో ఖ్యాతిగాంచిన ఆదికేశవస్వామి, శ్రీ రంగనాథస్వామి దేవస్థానాల్లో స్వామివార్లు ఉత్తర ద్వారంలో భక్తులకు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. ఆదికేశవ స్వామి దేవస్థానం వద్ద ప్రముఖ స్వీట్ షాప్ యజమాని ప్రజాపతి భవతీ రాం వివిధ ఆకారాల్లో దీపాల్ని వెలిగించారు. దేవదాయశాఖ అధికారి పోతుల రామకోటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీరంగపురంలోని మోహనరంగనాథస్వామి, చేబ్రోలు, కొత్త రెడ్డిపాలెం, శలపాడు, వడ్లమూడి తదితర గ్రామాల్లోని వైష్ణవ దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో తరలివచ్చారు. – చేబ్రోలు



శలపాడులో తెల్లవారుజామున ఉత్తర ద్వార దర్శనం కోసం ఎదురుచూస్తున్న భక్తులు

పాలస్తీనాపై యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలి



పుస్తకావిష్కరణలో నరసింహారెడ్డి తదితరులు

నగరంపాలెం: పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ఏ. నరసింహారెడ్డి కోరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాషువా పూలే పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రాడీపేట సీపీఎం కార్యాలయ ఆవరణలో శనివారం పాలస్తీనాపై కవిత్వం 'నేల లేని దేశం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. సభకు కవి విల్సన్ అధ్యక్షత వహించి మాట్లాడగా, పుస్తకాన్ని విరసం సీనియర్ నేత సి.ఎస్.ఆర్.ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వనరుల దోపిడీ కోసమే ఇజ్రాయిల్ పాలస్తీనాపై యుద్ధం చేస్తోందని విమర్శించారు. ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదానికి గాజాలో పిల్లలు, వృద్ధులు, స్త్రీలు భారీసంఖ్యలో మృత్యువాతకు గురవుతున్నారని పేర్కొన్నారు. సభలో వీసీకే పార్టీ మహిళా రాష్ట్ర నాయకురాలు కె.జయసుధ, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, ఆవాస్ రాష్ట్ర నేత ఎంఏ చిష్టి, రైతు కూలీ సంఘం నాయకులు ఎస్.బ్రహ్మయ్య, ముస్లిం సంక్షేమ సమితి నాయకులు అఫ్సర్ బాబు, బషీర్ అహమ్మద్ పాల్గొన్నారు.